## ఐక్యతతోనే సమస్యల పరిష్కారం

**శ్రీకాకుళం అర్బన్:** ఐక్యతతోనే ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.ఆర్ సూర్యనారాయణ అన్నారు. నగరంలోని ఒక హోటల్‌లో ఆదివారం నిర్వహించిన ఆ సంఘ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లామని, కొన్నింటికి పరిష్కారం లభించిందన్నారు. ఆర్థికపరమైన కొన్ని అంశాలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నారని

పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న సభ్యులు

చెప్పారు. సమావేశంలో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాస కుమార్, రాష్ట్ర కార్యదర్శి జి.తిరుపతిరావు, యుగంధర్, రాణా ప్రతాప్, జిల్లా అధ్యక్షులు ఇప్పిలి నారాయణరావు, సంతోష్ పాల్గొన్నారు.

కళాశాల భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

# విద్యతోనే అభివృద్ధి

## వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మానవ వనరుల్లో అత్యంత ప్రాధాన్యత కలిగినది విద్య అని, ఏ ప్రాంతమైతే విద్యకు ప్రాధాన్యత ఇస్తుందో ఆ ప్రాంతం అభివృద్ధి చెందిందని మనకు రుజువైందని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మండలంలోని కొత్తపేటలో ఉన్న కెజిబివి ఆవరణలో రూ.1.10 కోట్లతో నిర్మించిన జూనియర్ కళాశాల భవనాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మానవ వనరులను సక్రమంగా వినియోగించుకుంటే ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయులు 30 ఏళ్ల క్రితమే ఈ విషయం గుర్తించి గ్రామంలో పది ఇళ్లు ఉన్నా ఒక పాఠశాల, మూడు కిల్లో మీటర్ల దూరంలో ఒక యుపి స్కూల్, 5 కిలోమీటర్ల దూరంలో ఒక హైస్కూల్, ప్రతి మండలానికీ ఒక జూనియర్ కళాశాల, ప్రతి నియోజకవర్గానికీ ఒక ఇంజినీరింగ్ కళాశాల, ప్రతి జిల్లాకూ ఒక మెడికల్ కళాశాల ఉండాలని గుర్తించి అప్పట్లోనే ఏర్పాటు చేశారని అన్నారు. దీనివల్ల చాలా ఫలితాలు వచ్చాయని చెప్పారు. పాఠశాల పక్కనే 13 సెంట్లు ప్రభుత్వ స్థలం అందుబాటులో ఉందని, దీనిని ఆట స్థలం కోసం కేటాయించడానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. పాఠశాలలో అదనపు డార్మెటరీలను నిర్మించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. పాఠశాలల్లో బోధనా విధానంపై దృష్టి సారిస్తామన్నారు. సమగ్ర శిక్షా అభియాన్, ఆర్‌టిఇ చట్టం, పాఠశాల మౌలిక సదుపాయాలు, సౌకర్యాల మెరుగు, రెసిడెన్షియల్ హాస్టల్ భవనాలు, ఉపాధ్యాయులకు నిరంతర శిక్షణ, ఉచిత పాఠ్య పుస్తకాలు, పిల్లలకు ఏకరూప దుస్తులు, పిఎం పోషణ్ వంటి పథకాలు పాఠశాలల్లో పిల్లల నమోదును పెంపొందించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని వివరించారు. 2019 నుంచి 2024 వరకు విద్యా వ్యవస్థను చిన్నాభిన్నం చేసి చేశారని ఆరోపించారు. నాడు-నేడు పేరుతో రూ.4 వేల కోట్లు ఖర్చు చూపించి రంగులు, సేమాకులు చేసి మమా అనిపించుకున్నారని విమర్శించారు. కొన్నిచోట్ల భవనాలు బాగుచేసి పాఠశాలలు ఎత్తివేశారని, దీంతో బుడుబుడు అడుగులు వేసిన చిన్నారులు ఇబ్బందులు పడ్డారని అన్నారు. వీరి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకున్న చంద్రబాబు గత ప్రభుత్వం తీసుకొచ్చిన 117 జిఒను రద్దు చేశారని అన్నారు. మళ్లీ పాత విధానాన్ని కొనసాగిస్తూ... విద్యావ్యవస్థలో పూర్వవైభం తీసుకొస్తామని స్పష్టం చేశారు. ఉపాధ్యాయులు మరింత కృషి చేసి మంచి ఫలితాలు వచ్చే విధంగా కృషి చేయాలన్నారు. ప్రయివేటు విద్యా సంస్థలకు ధీటుగా పనిచేయాలని పిలుపు నిచ్చారు. గత ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు రద్దు చేసిన మధ్యాహ్న భోజనాన్ని మళ్లీ జనవరి ఒకటి నుంచి అమలు చేస్తామని చెప్పారు. ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు నాణ్యమైన స్టడీ మెటీరియల్ తయారు చేస్తున్నామని అన్నారు. క్రీడలు, చేతి వృత్తులు, బొమ్మలు పోటీలకూ ప్రాధాన్యత ఇచ్చేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు.

స్కూల్ కమిటీలూ పాఠశాలలపై బాధ్యత వహించి ఎప్పటి కప్పుడు పరిశీలిస్తుండాలని సూచించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, టిడిపి మండల అధ్యక్షులు బోయిన రమేష్, మాజీ ఎంపిపిలు తర్ర రామకృష్ణ, వెలమల విజయలక్ష్మి, కామేశ్వరరావు, పూజారి శైలజ, కర్రి అప్పారావు, కల్లి నాగయ్యరెడ్డి, ఇఇ డి.వి.ఎస్.మూర్తి, జెఇ రామనాథం, డిఇఒ తిరుమల చైతన్య, ఎంఇఒలు గోవిందరావు, ఎల్.వి.ప్రతాప్, ప్రిన్సిపాల్ కె.ప్రసన్నలక్ష్మి పాల్గొన్నారు.

### ఎన్‌టిఆర్ కార్యాలయంలో ప్రజాదర్బార్

వివిధ పనులపై ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చిన ప్రజలకు అధికారులు సానుకూలంగా స్పందించి వారి సమస్యలు పరిష్కరించాలని మంత్రి సూచించారు. స్థానిక ఎన్‌టిఆర్ కార్యాలయంలో ఆదివారం ప్రజా దర్బారు నిర్వహించారు. నియోజకవర్గంలోని టెక్కలి, సంతబొమ్మాళి, నందిగాం, కోటబొమ్మాళి మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత అధికారులతో మాట్లాడి అక్కడకక్కడే పలు సమస్యలు పరిష్కరించారు. క్రీడల్లో రాణించిన మండలం చిన్నహరిశ్చంద్రపురానికి చెందిన మోజ్జాడ ఢిల్లేశ్వరరావును మంత్రి అభినందించి సీల్డ్‌ను అందించారు.

వర్షాలకు తడిచిన పంటను చూపిస్తున్న సిపిఎం నాయకులు

# రూ.30 వేలు పరిహారం చెల్లించాలి

- తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి
- ఉచితంగా అపరాల విత్తనాలు అందించాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు
- పంట నష్టాలను పరిశీలించిన సిపిఎం ప్రతినిధి బృందం

ప్రజాశక్తి - మందస, నందిగాం

వర్షాలకు నీట మునిగి నష్టపోయిన వరి పంటకు ఎకరాకు రూ.30 వేలు నష్టపరిహారంగా చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మందస, నందిగాం మండలాల్లోని పలు ప్రాంతాల్లో ఆదివారం పర్యటించిన సిపిఎం ప్రతినిధి బృందం, పంటలు నష్టపోయిన పొలాలు, వరి కుప్పలను పరిశీలించారు. బాధిత రైతులతో మాట్లాడారు. జిల్లాలో వర్షాలతో వరి, పెసర, మినుము, కూరగాయలు తదితర పంటలను నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాపారులు బస్తాకు ఐదు కేజీల ధాన్యాన్ని అదనంగా తీసుకుంటున్నారని తెలిపారు. తేమ శాతం ఎక్కువగా ఉందని, తడిసిపోయిన ధాన్యం అని కొన్నిచోట్ల పది కేజీల వరకూ అదనంగా తీసుకుంటున్నారని రైతులు తమ గోడుని వెళ్లబోసుకున్నారు. తన రెండెకరాల పంట వర్షాలకు తడిచిపోయిందని, ఆ ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదని రైతు మడ్డు వాసుదేవరావు వాపోయాడు. వరి చేనులో వేసిన అపరాలు వర్షాలకు పూర్తిగా పాడైపోయాయని, విత్తనాలను ఉచితంగా అందించాలని సిపిఎం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకోవడం కోసం హార్వెస్టర్ యంత్ర పరికరాలు, టార్పాలిన్లు ఏర్పాటు చేయాలన్నారు. తేమ శాతం 25 ఉన్నా కొనుగోలు చేస్తామని, రైతులు వద్ద ఉన్న చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటనలు చేస్తున్నా, ఆచరణలో అమలు కావడం లేదన్నారు. తేమ పేరుతో వ్యాపారులు తూనికల్లో రైతులని మోసం చేస్తూ ఐదు నుంచి పది కేజీల వరకు అదనంగా తీసుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోకుండా వ్యవహరిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు హనుమంతు ఈశ్వరరావు, బగాది వాసుదేవరావు, రైతులు కె.కేశవరావు, బాలకృష్ణ, కృష్ణారావు, దుర్యోధనరావు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**లావేరు :** మండలంలోని కొత్తకోట, పెద్దకొత్తకోటలో వర్షాలకు తడిచిన, నీటమునిగిన వరి పంటను సిపిఎం ప్రతినిధి బృందం పరిశీలించింది. రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. తేమ పేరుతో వ్యాపారులు తూనికల్లో రైతులని మోసం చేస్తూ ఐదు నుంచి పది కేజీల వరకు అదనంగా తీసుకుంటున్నారనిరైతులు ఎం.దుర్గరాజు, మేడబోయిన విష్ణుమూర్తి, ఎం.గురునాథ్, ముత్త శ్రీరామ్మూర్తి, గౌతమి, వరలక్ష్మి తదితరులు చెప్పారు. తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదని వాపోయారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.తేజేశ్వరరావు, నాయకులు ఎన్.వి రమణ, పి.చంద్రరావు, వెలమల రమణ తదితరులు పాల్గొన్నారు.

వివరాలను వెల్లడిస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

# చైన్ స్నాచర్ అరెస్టు

- 8.25 తులాల బంగారు నగలు స్వాధీనం
- ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్, కవిటి

మహిళలను లక్ష్యంగా చేసుకుంటూ చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న నిందితుడు నర్తు రాజేష్‌ను అరెస్టు చేసినట్లు ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి తెలిపారు. నిందితుడి నుంచి 8.25 తులాల బంగారు నగలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈనెల 16న కవిటి మండలంలో ఉపాధ్యాయురాలిపై ఈ నిందితుడే దాడి చేసినట్లు తెలిపారు. నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుడిని ప్రవేశపెట్టి వివరాలను వెల్లడించారు. కవిటి మండలం భైరిపురానికి చెందిన రాజేష్ చేసిన అప్పులు తీర్చేందుకు చోరీలను మార్గంగా ఎంచుకున్నాడు. అందులో భాగంగా నవంబరు ఏడో తేదీన కవిటి మండలం తొత్తిడిపుట్టుగ నుంచి రాజపురం వైపు పాల క్యానుతో వస్తున్న మహిళ మెడలో పుస్తెలతాడు తెంపుకొని వెళ్లి తన ఇంట్లో దాచుకున్నాడు. అదే నెల 23వ తేదీన కంచిలి మండలం సూదిపుట్టుగ వద్ద స్కూటీపై ఇద్దరు మహిళలు వస్తున్న సమయంలో డ్రైవింగ్ చేస్తున్న మహిళ మెడ నుంచి బంగారు గొలుసు దొంగలించాడు. ఈనెల రెండో తేదీన కంచిలి మండలం తలతంపర గ్రామం సీతయ్య ఫౌండేషన్ సమీపంలో స్కూటీపై వెళ్తున్న ఇద్దరు మహిళల మెడలో గొలుసు తెంచేందుకు ప్రయత్నించగా, అది వారి వద్ద ఉండిపోవడంతో పారిపోయాడు. 15వ తేదీన బెల్లుపడ గాంధీ మండపం సమీపంలో ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలో నుంచి బంగారు నక్లెస్ తెంపుకొని బైక్‌పై పరారయ్యాడు. 16వ తేదీన తన గ్రామానికే చెందిన ఉపాధ్యాయురాలు భారతిని వెంబడించి ఆమె మెడలోంచి గొలుసు దొంగలించే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య పెనుగులాట జరిగింది. బాధితురాలు తనని గుర్తించడంతో పక్కనే ఉన్న రాయిని తీసుకుని ఆమె తలపై బలంగా కొట్టాడు. ఈలోగా స్థానికుల అలజడితో పరారయ్యాడు. అనంతరం అదే రోజు ఉదయం పది గంటల సమయంలో ఇచ్ఛాపురం మండలం బెల్లుపడ కాలనీకి చెందిన ఇద్దరు మహిళలు స్కూటీపై వస్తుండగా, ఈదుపురం గ్రామం స్కై డ్రాప్ సమీపంలో వారి మెడలో గొలుసు దొంగలించుకుని పోయాడు. చోరీ చేసిన సొత్తుతో పరారయ్యే క్రమంలో ఈనెల 21వ తేదీన కవిటి మండలం కొజ్జిరియా వద్ద కవిటి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇప్పటికే నిందితుడిపై కవిటి, కంచిలి, ఇచ్ఛాపురం పోలీస్‌స్టేషన్లలో రెండేసి కేసులు నమోదైనట్లు తెలిపారు. మొత్తం ఆరు కేసుల్లో 8.25 తులాల బంగారం స్వాధీనం చేసుకోగా, వాటి విలువ రూ.7,76,958గా తెలిపారు. నేరాలకు అవకాశమున్న ప్రదేశాలను గుర్తిస్తున్నామని, ఆయా ప్రాంతాల్లో గస్తీ నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. తక్కువ సమయంలో కేసులు ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన కాశీబుగ్గ డిఎస్‌పి ఎం.అప్పారావు, ఇచ్ఛాపురం సిఐ ఎం.చిన్నంనాయుడు, ఇచ్ఛాపురం టౌన్ ఎస్‌ఐ ఇ.చిన్నంనాయుడు, కవిటి ఎస్‌ఐ వి.రవివర్మను ఎస్‌పి ప్రత్యేకంగా అభినందించారు.

మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

## ప్రతి పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్

### జిల్లా విద్యాశాఖ అధికారి తిరుమల చైతన్య

**శ్రీకాకుళం:** ప్రతి పాఠశాలలో భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాలను ప్రారంభించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.తిరుమల చైతన్య సూచించారు. నగరంలోని భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ భవనంలో జిల్లాలోని పలు స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లకు ఈనెల 16 నుంచి వారం రోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక శిక్షణా కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించడంలో భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాలు విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయన్నారు. శిక్షణలో 36 మంది స్కౌట్ మాస్టర్లు, 33 మంది గైడ్ కెప్టెన్లు పాల్గొన్నారు. పలు రంగాల నిపుణులు డి.ఎల్ నారాయణ, బి.శివ నాగిరెడ్డి, కె.దుర్గా నాగేశ్వరరావు, పి.సుశీల, జి.బుజ్జిబాబు, రాజేశ్వరి, ప్రమీల శిక్షణను నిర్వహించారు. డిఇఒతో పాటు స్కౌట్స్ అండ్ గైడ్స్ సెక్రటరీ జి.రాజేంద్రప్రసాద్, జాయింట్ సెక్రటరీ వి.వాగ్దేవి, ఉప విద్యాధికారి విజయకుమారి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ముగింపు కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, నిక్కు అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రమాసుందరి

శ్రీకాకుళం సాయుధ పోరాటానికి 'నక్షత్రబాట' సాక్ష్యం

వార్త మెయిన్‌లో

# ఆయాలకు కనీస వేతనాలు ఇవ్వాలి

మాట్లాడుతున్న మహాలక్ష్మి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు (ఆయాలు)కు కనీస వేతనాలు అమలు చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని ప్రభుత్వ పాఠశాలల ఆయా వర్కర్ల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు అల్లు మహాలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో ఆ సంఘ విస్తృత సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో అట్టడుగున ఉన్న పేదలు ప్రభుత్వ పాఠశాలల్లో ఆయాలుగా పనిచేస్తున్నారని, వారికి స్వచ్ఛభారత్ కార్మికులకు ఇచ్చిన జిఒ ప్రకారం కనీస వేతనాలు అమలు చేయడం లేదన్నారు. దీనికితోడు ఐదు నెలలుగా ప్రభుత్వం వేతనాలు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ జీతంపై ఆధారపడి కుటుంబాలను పోషిస్తున్న వీరికి సకాలంలో వేతనాలు చెల్లించకపోవడం వల్ల అప్పులు చేయాల్సి వస్తోందన్నారు. ఉదయం ఏడు నుంచి రాత్రి ఏడు గంటల వరకు పాఠశాలల్లోనే పనిచేస్తున్నారని, దీంతో ఇతర కూలి పనులకు వెళ్లే పరిస్థితి లేదన్నారు. 300 మంది విద్యార్థులకు ఒక ఆయాను నియమించాలని ప్రభుత్వం చేస్తున్న నిర్ణయం వల్ల పని ఒత్తిడి పెరిగిపోతుందని చెప్పారు. చిన్న పాఠశాలల్లో ఉన్న ఆయాలను అర్ధాంతరంగా తొలగించే కుట్ర జరుగుతోందన్నారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేసి 50 మంది విద్యార్థులకు ఒక ఆయాను నియమించాలని డిమాండ్ చేశారు. రూ.ఆరు వేల వేతనంతో ఆయాలు పనిచేస్తున్నారని, చాలని వేతనాలతో కుటుంబాలను పోషించలేక అవస్థలు పడుతున్నాని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ వేధింపులు, తొలగింపులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గుర్తింపు కార్డులు, శానిటేషన్ పరికరాలు (గౌజులు, మాస్కు, శానిటేషన్, చీపుర్లు, ఫినాయిల్ ) ప్రభుత్వమే సరఫరా చేయాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ఏడాదికి రెండు జతల యూనిఫారం ఇచ్చి నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. సమావేశంలో యూనియన్ నాయకులు టేక హేమ, పి.నవీన, వి.ఢిల్లేశ్వరి, బి.స్వాతి, కనకమ్మ, తిరోమణి, భాను తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై గ్రామస్థాయిలో అవగాహన

### ఎస్‌పి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - ఆమదాలవలస

సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల అనర్థాలపై గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులకు సూచించారు. వార్షిక తనిఖీలో భాగంగా ఆమదాలవలస పోలీస్‌స్టేషన్‌ను ఆదివారం పరిశీలించారు. సిబ్బంది గౌరవ వందనం అనంతరం స్టేషన్ పరిసరాలు పరిశీలించి, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌లో పలు రికార్డులను పరిశీలించి, గ్రేవ్ కేసుల దర్యాప్తుపై ఆరా తీశారు. రికార్డుల్లో లోటుపాట్లపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామాల్లో శాంతిభద్రతలపై సరైన సమాచారాన్ని సేకరిస్తూ, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు పటిష్టంగా పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి ప్రమాదాలను నివారించాలని సూచించారు. ప్రతిరోజూ విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. పోలీసు సిబ్బంది వత్తి నైపుణ్యాన్ని పెంచుకుంటూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులపై మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో డిఎస్‌పి సిహెచ్.వివేకాంద, సిఐ పి.సత్యనారాయణ, ఎస్‌ఐ కె.వెంకటేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

## యురేకా సైన్స్ ఎక్స్‌పో పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - పలాస

యురేకా సైన్స్ ఎక్స్‌పో-2025లో భాగంగా 8, 9, 10 తరగతుల విద్యార్థులకు సైన్స్ ప్రయోగాల వీడియో కాంటెస్ట్‌ను ఈనెల 22 నుంచి జనవరి 26వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ తెలిపారు. కాశీబుగ్గ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గణిత శాస్త్రవేత్త రామానుజన్ విగ్రహం వద్ద యురేకా సైన్స్ ఎక్స్‌పో పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందుకు సంబంధించిన ఫలితాలు ఫిబ్రవరి 15న గెలీలియో జయంతి సందర్భంగా వెల్లడిస్తామన్నారు. జన విజ్ఞాన వేదిక ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో బహుమతులను అందిస్తామని తెలిపారు. సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణం-సుస్థిరాభివృద్ధి, మూఢనమ్మకాలు, శాస్త్రీయ దృక్పథం అంశాలపై విద్యార్థులు ప్రయోగాలను వీడియో షూట్ చేసి జెవివి గూగుల్ ఫామ్‌లో అప్‌లోడ్ చేస్తామన్నారు. ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం, ప్రధానోపాధ్యాయులు, సైన్స్ ఉద్యమాభిమానులు విద్యార్థులను ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక విద్యా సబ్ కమిటీ జిల్లా కన్వీనర్ పాలవలస ధర్మారావు, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిశోర్ కుమార్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.బాబూరావు, బి.శ్రీరామ్మూర్తి, ఎంఇఒ చెరుకుపల్లి సత్యం, జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి ఎల్.వి చలం తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గిరిధర్ తదితరులు

# సోలార్‌తో నిరంతర విద్యుత్

- మూడు లక్షల ఇళ్లల్లో రూఫ్‌టాప్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యం
- పిఎం సూర్య ఘర్ పథకాన్ని వినియోగించుకోవాలి
- సమస్యల పరిష్కారానికి 1912 టోల్ ఫ్రీ నంబరు
- ఇపిడిసిఎల్ ఎస్ఇ నాగిరెడ్డి కృష్ణమూర్తి





ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో పెరుగుతున్న విద్యుత్ వాడకాన్ని దృష్టిలో పెట్టుకుని పిఎం సూర్యఘర్ పథకాన్ని ప్రజలకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎపి ఇపిడిసిఎల్) ఎస్ఇ నాగిరెడ్డి కృష్ణమూర్తి తెలిపారు. సోలార్ విద్యుత్‌తో అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ పొందవచ్చన్నారు. వినియోగదారులు తమ అవసరాలకు వీలుగా ఇంటి వద్దే విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకొచ్చిందని చెప్పారు. దీన్ని వినియోగించుకోవాలని సూచించారు. జిల్లాలో అవకాశమున్న ప్రతి ఇంటి పైన సోలార్ విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహిస్తున్నామన్నారు. జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది మూడు లక్షల ఇళ్లల్లో సౌర విద్యుత్ ఉత్పత్తి చేసుకునేందుకు లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. 'ప్రజాశక్తి' ముఖాముఖిలో పలు అంశాలను ఆయన వెల్లడించారు.

**? పిఎం సూర్యఘర్ పథకం కోసం దరఖాస్తు ఎలా చేసుకోవాలి?**

వినియోగదారులు తమ ఆండ్రాయిడ్ మొబైల్‌లో గూగుల్ ప్లేస్టోర్, ఆపిల్ ప్లే స్టోర్ నుంచి పిఎం సూర్య ఘర్ మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఈ యాప్ ద్వారా పిఎం సూర్య ఘర్ పథకం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. యాప్ డౌన్‌లోడ్ అనంతరం రాష్ట్రం, జిల్లా, విద్యుత్ సరఫరా సంస్థ పేరు, 15 అంకెల విద్యుత్ బిల్లు సర్వీసు నంబరు (గృహ వినియోగదారులు), విద్యుత్ బిల్లుకు అనుసంధానమైన మొబైల్ నంబరు, ఇ-మెయిల్ పొందుపరిచి నమోదు కావాలి. యాప్ రిజిస్ట్రేషన్ అనంతరం మొబైల్ నంబరుతో లాగిన్ కావాలి. సోలార్ రూఫ్ టాప్, కిలోవాట్స్, సబ్సిడీ, బ్యాంకు వివరాలను పొందుపరిచి అప్లికేషన్ సమర్పించాలి. సోలార్ దరఖాస్తుదారుడు ప్రస్తుత గృహ వినియోగ కాంటాక్ట్ లోడ్, అంతకన్నా తక్కువ మాత్రమే వెబ్ పోర్టల్‌లో నమోదు చేయాలి. అనంతరం కిలోవాట్స్‌కి సంబంధించిన ఛార్జీలు చెలించాలి. వెబ్ పోర్టల్ నుంచి నిర్ధారణ పొందిన తర్వాత విద్యుత్‌శాఖ అధికారులు సంబంధిత గృహ ప్రదేశాన్ని పరిశీలించి సోలార్ నెట్ మీటరు ఏర్పాటు చేస్తారు.

**? పిఎం సూర్యఘర్ పథకం ఎంతమేరకు ప్రయోజనకరమని భావిస్తున్నారు?**

జిల్లావ్యాప్తంగా విద్యుత్ అవసరాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. పెరుగుతున్న లోడ్ ఇతర కారణాల వల్ల కొన్నిసార్లు ఇబ్బందులు వస్తున్నాయి. వినియోగదారులకు విద్యుత్ ఇంధన పొదుపులో భాగంగా ప్రత్యక్షంగా సూర్యరశ్మి ద్వారా విద్యుత్ ఉత్పాదనకు ఉండే అవకాశాలపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి గృహ విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఇంటిపై సౌర విద్యుత్ ప్యానల్స్ అమర్చుకునేందుకు వీలుంది. రూఫ్ టాప్ సోలార్ ఎనర్జీ అందించడానికి సన్నాహాలు చేస్తున్నాం.

**? సూర్యఘర్ పథకంపై లబ్ధిదారులు ఎలాంటి ఆసక్తి కనబరుస్తున్నారు?**

ఇంటి వద్ద ఉత్పత్తి అయ్యే సోలార్ విద్యుత్‌ను వినియోగదారులు తమ అవసరాలకు వాడుకుని మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు పంపించుకోవచ్చు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం సంప్రదాయ ఇంధన వనరులను సద్వినియోగం చేసుకోవాలని పిఎం సూర్యఘర్ పథకం అమలు చేస్తోంది. సోలార్ విద్యుత్ ఉత్పత్తి పెంచడానికి వీలుగా ఈ పథకాన్ని ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకునేందుకు వీలుగా ప్రతి వినియోగదారునికి అవగాహన కల్పిస్తున్నాం. జిల్లాలో మూడు లక్షల ఇళ్లల్లో అనువైన పరిస్థితి ఉందని గుర్తించాం.

**? జిల్లాలో ప్రస్తుత విద్యుత్ వాడకం ఎలా ఉంది?**

జిల్లాలో పారిశ్రామిక, గృహ అవసరాలతో పాటు వ్యవసాయ రంగానికి ఊతమిచ్చేందుకు ప్రస్తుతం విద్యుత్ సరఫరా చేస్తున్నాం. అందులో అత్యధికంగా గృహ అవసరాలకు 6.75 లక్షల కనెక్షన్ల ద్వారా విద్యుత్ సరఫరాను అందిస్తున్నాం. శ్రీకాకుళం, టెక్కలి, పలాస డివిజన్లలో మొత్తం 8,05,204 విద్యుత్ కనెక్షన్లు ఉంటే అందులో 6,75,196 కనెక్షన్లు ఇంటి వినియోగ సర్వీసులే ఉన్నాయి.

**IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE SRIKAKULAM**
**EP. 65/2019 in OS. 5/2019**

Between:-
**Vapada Venkata Ramana Murthy** ....Dhr
And:-
**Dannana Rami naidu** ....Jdr

To,
**Dannana Raminaudu,** S/o late chinnamnaidu, 3-23, Dannana veedhi, Bejjipuram village,Laveru mandalam, Srikakulam district

**NOTICE**

పై నెంబర్ EP.65/19 in OS.5/2019లో మీకు నోటీసు నిమిత్తము మీరు ఇందులో JDR ఉన్నారు. మీకు నోటీసు నిమిత్తము మీ హాజరు కొరకై తేదీ **24-12-2024 న వాయిదా అయి ఉన్నది.** సదరు పై తేదీన ఉదయం 10:30 నిమషాలకు స్వయంగా గాని వకీల్ ద్వారా గాని. హాజరై మీ వాదన తెలియపరచవలెను లేనియెడల మీ పరోక్షమున శ్రీ కోర్టు వారు విచారించి తీర్మానించడం అగును

సి.హెచ్. రవి
న్యాయవాది, శ్రీకాకుళం.

**IN THE HONOURABLE COURT OF THE ADDITIONAL CIVIL JUDGE ( JUNIOR DIVISION ) CUM EXCISE COURT AT SRIKAKULAM.**
**O.S. No.404/2022.**

Between: **Namana Parvateeswara Rao and another** ......Plaintiffs
And: **Mupidi SrinivasaRao and 29 others** ....Defendants

To,
**DEFENDANTS NO.2: Pasupureddy Laxmi @Satyavathi,** W/o Pushpa Rao, aged about 50 years, household duties R/o Jaipur, Orissa State, C//o Mupidi SrinivasaRao S/o Late Venkata Ramana,R/o Door No.1-1, Subhadrapuram junction, H/o Thallavalasa village,Laveru mandal, Srikakulam district.
**DEFENDANTS NO.6: Yernagula Ramakrishna,** S/o Late Nageswara Rao aged about 26 years R/o Kondampet village Rajam mandal erstwhile Srikakulam district.Now Vijayanagaram district.

**NOTICE**

Please take notice that the above matter is posted on Dt.23-12-2024.for your appearance.You both are hereby directed to appear before the Honourable court on **Dt. 24-12-2024 at 10.30 AM** either in person through an Advocate without fail and file your objections if any otherwise matter will be decided in your absence.

**// By court order //**

**BORA TIRUMALA REDDY**
**ADVOCATE FOR PLAINTIFF,**
**SRIKAKULAM.**

మరమ్మతులు చేయించి బిగించిన మోటారు

## కేశవరాయపురంలో తీరిన తాగునీటి ఇక్కట్లు

**'ప్రజాశక్తి' కథనానికి స్పందన**

**లావేరు:** లావేరు పంచాయతీ పరిధిలోని కేశవరాయపురంలో ఎట్టకేలకు తాగునీటి ఇక్కట్లు తీరాయి. ఆదివారం ప్రజాశక్తి పత్రికలో కేశవరాయపురంలో తాగునీటి ఇక్కట్లు అనే కథనం ప్రచురించ బడడంతో అధికారులు, గ్రామ పంచాయతీ పాలకులు స్పందించారు. ఆదివారం ఉదయాన్నే యుద్ధప్రాతిపదికన మోటారు మరమ్మతులు చేయించి, విద్యుత్ కనెక్షన్ ఇచ్చి మోటార్‌ను రన్నింగ్‌లోకి తీసుకొచ్చి డైరెక్ట్ పంపింగ్ ద్వారా వీధుల్లోని కుళాయిల ద్వారా తాగునీటిని అందజేశారు. దీంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. గత వారం రోజులుగా తాగునీరు లేక తీవ్ర అవస్థలు పడ్డామని సమస్యను ప్రజాశక్తి దృష్టికి తీసుకెళ్లడంతో ఒక్కరోజులోనే అధికారులు స్పందించి తాగునీరు సమస్య పరిష్కారం చేశారని ప్రజాశక్తికి వారంతా కృతజ్ఞతలు తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అప్పలనాయుడు

## గ్రామాల్లో అభివృద్ధి పనులు గుర్తించాలి

**లావేరు:** గ్రామాల్లో అభివృద్ధి పనులు గుర్తించాలని, టిడిపి సభ్యత్వ నమోదులో నియోజకవర్గం ప్రథమ స్థానంలో ఉండాలని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. ఆదివారం ఓ కళ్యాణ మండపంలో టిడిపి మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్ అధ్యక్షతన టిడిపి మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఎంపీ మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు సభ్యత్వ నమోదు వేగవంతం కావాలని ఆదేశించారని, సభ్యత్వ నమోదులో ప్రథమ స్థానంలో నిలవాలన్నారు. మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్ మాట్లాడుతూ గ్రామాల్లో రెండో విడత పల్లె పండగ పనులకు పనులను గుర్తించి ప్రతిపాదనలు ఇస్తే త్వరలోనే నిధులు మంజూరు కానున్నాయని తెలిపారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకపక్ష ఫలితాలు సాధించి వైసిపిపై ఘనవిజయం సాధించేందుకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, మాజీ ఎంపిపి మీసాల వెంకటరమణ, మాజీ జెడ్‌పిటిసిలు పి.మధుబాబు, ఆర్.ప్రకాశరావు, నాయకులు లంకలపల్లి శ్రీనువాసరావు, జగ్గన్నదొర, కోరాడ వెంకటరమణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నెత్తురోడుతున్న రహదారి

- గోతులతో ప్రమాదాలు
- పదుల సంఖ్యలో మరణాలు
- నిర్లక్ష్యం చూపుతున్న ఆర్అండ్‌బి అధికారులు

**ఆ రహదారిపై ప్రయాణం అత్యంత ప్రమాదకరంగా మారింది. కనురెప్ప పాటులో ప్రాణాలు కోల్పోయిన పరిస్థితులు ఉన్నాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత ఆర్అండ్‌బి అధికారుల నిర్లక్ష్య ధోరణి మారకపోడం ప్రయాణికులకు ప్రాణ సంకటంగా మారింది.**

ప్రజాశక్తి- బూర్జ

శ్రీకాకుళం-పాలకొండ ప్రధాన రహదారిపై నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. అయితే బూర్జ మండలం పరిధిలో ఉన్న పాలవలస గ్రామం నుంచి ఉప్పినవలస వరకు రహదారి అధ్వానంగా తయారైంది. ముఖ్యంగా రహదారి మొత్తం గోతుల మయంగా మారడంతో గత రెండేళ్లలో అనేక మంది మృత్యువాత పడ్డారు. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తున్నారని మండల ప్రజలు బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ ఏడాదిలోనే రహదారి ప్రమాద సంఘటనల్లో సుమారు పదిమంది మృత్యువాత పడ్డారు. ఇందులో పెద్దపేట గ్రామం వద్ద మన్మథరావు రోడ్డు

అప్పలపేట వద్ద అధ్వానంగా ఉన్న రహదారి

పాలవలస హైస్కూల్ ఎదురుగా అధ్వానంగా ఉన్న రహదారి

ప్రమాదంలో మృతి చెందాడు. అలాగే 10వ తరగతి పరీక్షల సందర్భంగా విధులు నిర్వహించి తిరిగి వస్తుండగా సురేష్ అనే కానిస్టేబుల్ నీలంపేట గ్రామ జంక్షన్ గోతులవద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తాపడి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. అలాగే మదనాపురం గ్రామ జంక్షన్ వద్ద మజ్జి నరసింహ, లచ్చయ్యపేట గ్రామ జంక్షన్ వద్ద ఐశ్వర్య, సింగన్న పాలెం జంక్షన్ వద్ద బ్యాంక్ ఉద్యోగి నందికేశ్వరరావు, వైకుంఠపురం గ్రామ మలుపు వద్ద కెజిబివిలో పనిచేస్తున్న శ్రీదేవిలు మృత్యువాత పడటం శోచనీయం. వీరితోపాటు మరికొంత మంది ప్రాణాలు విడిచారు.

### మృత్యు ఘంటికలు

ముఖ్యంగా మండలంలోని పాలవలస జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద, గ్రామ జంక్షన్ వద్ద అలాగే ఉప్పనివలస తదితర గ్రామాల సమీపంలో రహదారి పూర్తిగా గోతులమయంగా మారడంతో అనునిత్యం ప్రమాద సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి.

### జాడలేని ఆర్అండ్‌బి అధికారులు

గత రెండు, మూడు సంవత్సరాల్లో పదుల సంఖ్యలో వాహన చోదకులు ప్రమాదాల్లో మృత్యువాత పడ్డారు. ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాల్సిన ఆర్అండ్‌బి శాఖ అధికారులు నిమ్మక నీరెత్తినట్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇంతవరకు రహదారి మరమ్మతుల కోసం చర్యలు తీసుకున్న దాఖలాలు లేవన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతున్న రహదారిని మరమ్మతులు జరిపి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

### కొడుకును కోల్పోయాం

అంది వచ్చిన కొడుకు అనంత లోకాలకు వెళ్లిపోయాడు. ఉద్యోగ రీత్యా శ్రీకాకుళం వెళ్తున్న తమ కుమారుడు ఇదే రహదారిపై ప్రమాదవశాస్తు గోతుల వద్ద బోల్తా పడి మృతి చెందాడు. ఈ రహదారి నా కొడుకును పొట్టన పెట్టుకుంది.

**- కాద పోలమ్మ, తుడ్డలి**

### చర్యలు శూన్యం

ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. తరచూ ప్రమాదాలు జరగడం ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నా ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు శూన్యం.

**-పల్ల వీరాస్వామి, చీడివలస**

గాయపడిన క్షతగాత్రులు

## ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మండలంలోని కె.కొత్తూరు సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. సర్వీస్ రోడ్డులోని లారీని నిలుపుదల చేసి డ్రైవర్ రోడ్డు దాటుతున్నాడు. ఈ సమయంలో సంతబొమ్మాళి మండలం దండుగోపాలపురానికి చెందిన మలగాం లక్ష్మీనారాయణ ద్విచక్ర వాహనంపై వచ్చి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఇద్దరూ కిందకు పడిపోవడంతో గాయపడ్డాడు. వెంటనే స్థానికులు 108లో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## రేపు నందిగాం మండల సమావేశం

**నందిగాం :** ఈనెల 24న మండల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ టి.రాజారావు ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం ఉదయం 10 గంటలకు ఎంపిపి నడిపూరి శ్రీరామ్మూర్తి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విధిగా సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, పూర్తి సమాచారంతో అధికారులు హాజరుకావాలన్నారు.

పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శిరీష

## ఎమ్మెల్యే శిరీష పరామర్శ

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ పరిధిలోని చినబాడంలో ఉన్న టిడిపి పట్టణ అధ్యక్షుడు బడ్డ నాగరాజును ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాగరాజు కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. భయపడాల్సిన అవసరం లేదన్నారు. ఆమెతో పాటు ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్లు కుత్తుం లక్ష్మణ్‌కుమార్, పుచ్చ ఈశ్వరరావు, సూరాడ మోహనరావు, లోడగల కామేశ్వరరావు, బావన దుర్యోధన తదితరులు ఉన్నారు.

### తెలుగు బుక్ ఆఫ్ రికార్డులో 'తెప్పల'కు స్థానం

ప్రజాశక్తి- పలాస

తెలుగు బుక్ ఆఫ్ రికార్డులో రచయిత, నటుడు, సమాజ సేవకులు, జన జాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ తెప్పల కృష్ణారావుకు స్థానం కలిగించారు. విజయవాడ తెలుగు కళా రత్నాలు, సాంస్కృతిక సేవా సంస్థ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో నిష్ణాతులైన పలువురిని గుర్తించారు. అందులో విజయవాడ ఠాకూర్ గ్రంథాలయంలో నిర్వహించిన బృహత్తర కార్యక్రమంలో కృష్ణమూర్తికి స్థానం కల్పించారు. తెలుగు బుక్ ఆఫ్ రికార్డు ధ్రువపత్రాన్ని, జ్ఞాపికను అందజేశారు. దుశ్శాలువ, గజమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంస్థ జాతీయ చైర్మన్ డాక్టర్ యు.వి.రత్నం, జాతీయ కన్వీనర్ డాక్టర్ దనాసి ఉషారాణి, తెలుగు శాఖాధిపతి డాక్టర్ బాల చందర్ సాతే, డాక్టర్ చివుకుల సాంబశివరావు పాల్గొన్నారు.

### త్వరలో మాజీ సైనికుల సంఘం ఎన్నికలు

**ఆమదాలవలస:** పట్టణంలో త్వరలోనే మాజీ సైనికుల యూనియన్ ఎన్నికలు జరగనున్నట్లు జిల్లా ఎక్స్ సర్వీస్ మెన్ ఫెడరేషన్ అధ్యక్షులు కటకం పూర్ణచంద్రరావు తెలిపారు. ఆదివారం పట్టణంలో ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో సైనికుల అధ్యక్షులు సూర అవతారం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అవతారం మాట్లాడుతూ తన ఆరోగ్యం సహకరించని కారణంగా నూతన వ్యక్తిని ఎన్నుకోవాలని ఆయన ప్రతిపాదించారు. చైర్మన్ గురుగుబెల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్నికల కమిటీ ఏర్పాటు చేసి జనవరిలో నామినేషన్లు స్వీకరించి ఫిబ్రవరిలో ఎన్నికలు నిర్వహించాలని సభకు వివరించారు. ఎలక్షన్ కమిటీ మెంబెర్స్‌గా విశ్రాంత లెఫ్టినెంట్ కల్నల్ పి.శంకరరావు, సుబేదార్ మేజర్ బర్రి సంజీవ రావు (రిటైర్డ్), సుబేదార్ గురుగుబెల్లి సత్యనారాయణ (రిటైర్డ్) ఉంటారని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికులు గురుగుబెల్లి సత్యనారాయణ, తాండ్ర జనార్దనరావు, బొడ్డేపల్లి శ్రీనివాస్, పేడాడ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## రక్తదాన శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని జామియా మసీదులో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రారంభించి మాట్లాడుతూ స్వచ్ఛందంగా ముస్లిం యువకులు, పెద్దలు రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. ఈ శిబిరంలో 80 మంది రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ సహకారంతో నిర్వహించిన ఈశిబిరంలో రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు, జామియా మసీదు అధ్యక్షులు మహిబుల్లా ఖాన్, అఖిల భారత మానవతా సందేశ సమితి కన్వీనర్ అబ్దుల్ కలామ్, సలీమ్, ముజీబ్ పాల్గొన్నారు.

## దాడులు ముమ్మరం

**సోంపేట:** మండలంలోని నాటుసారా, బెల్ట్‌షాపులపై ఆదివారం ముమ్మరంగా దాడులు నిర్వహించామని బారువ ఎస్ఐ హరిబాబు తెలిపారు. చౌకపేట గ్రామానికి చెందిన కదంబల పూర్ణచంద్రరావు విక్రయానికి సిద్ధంగా ఉంచిన 24 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. కోరంజిభద్ర వద్ద కర్రి నరసింహులు అనే వ్యక్తి అక్రమంగా 60 లీటర్ల నాటు సారా తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

## చురుగ్గా టిడిపి సభ్యత్వ నమోదు

**నౌపడ:** సంతబొమ్మాళి మండలం నౌపడ పంచాయతీ సీతానగరంలో టిడిపి సీనియర్ నాయకులు వాడరేవు కృష్ణారావు ఆధ్వర్యాన ఆదివారం టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని పది పాయింట్లు వద్ద టిడిపి కార్యకర్తలు ముమ్మరంగా టిడిపి సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిడిపి సభ్యత్వ నమోదుతో ప్రతి ఒక్కరికి పార్టీ నుంచి లబ్ధిచేపడుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బచ్చల బ్రహ్మానందం, బచ్చల గోపాలరావు, కొన్నాడ రామారావు, నీలవేణి, భవాని, ప్రసాద్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

## రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీడాప్ మాజీ చైర్మన్ డి.శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని మండపల్లి, అరకభద్ర, కొలిగాం, బూర్జపాడు తదితర గ్రామాల్లోని నీట మునిగిన వరి పంటను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చేతికి పంట వచ్చే సమయంలో కురిసిన వర్షాలకు వరి పొంట నీటమునిగిందన్నారు. ఇంకోవైపు క్రాప్, ఇన్స్యూరెన్స్ లేకపోవడంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే రంగు మారిన, మొలకెత్తిన ధాన్యాన్ని మద్దతు ధరకే కొనుగోలు చేయాలన్నారు. రైతు భరోసా పథకాన్ని తక్షణమే అమలు చేసి ఆదుకోవాలన్నారు. ఆకాల వర్షాలు వల్ల నష్టపోయిన పంటలకు వాతావరణ ఆధారిత పంటల బీమా ప్రీమియం సొమ్ము ప్రభుత్వం కట్టకపోవడంతో రైతులు మరింత నష్టపోతున్నారని అన్నారు. కనీసం టార్పాలిన్లు కూడా పంపిణీ చేయలేదన్నారు.

నిరసన తెలుపుతున్న కార్మికులు

## ఛార్టర్ ఆఫ్ డిమాండ్లను నెరవేర్చాలి

ప్రజాశక్తి- మందస

రైస్ మిల్లు కార్మికుల ఛార్టర్ ఆఫ్ డిమాండ్లను తక్షణమే నెరవేర్చాలిన సిఐటియు జిల్లా నాయకులు ఎన్.గణపతి, మండల కన్వీనర్ కె.కేశవరావులు డిమాండ్ చేశారు. మండలంలోని సిద్దూరు పరిధిలో ఉన్న సిఐటియు కార్యాలయంలో రైస్ మిల్లు కార్మికులతో ఆదివారం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాజమాన్యాలు బెదిరింపులకు కార్మికులు బెదిరేది లేదని స్పష్టం చేశారు. కార్మికుల హక్కులు ఉల్లంగించకుండా అధికారులు చర్యలు తీసుకొని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 26న రైతు కార్మిక ప్రజా సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. దశలవారీ పోరాటానికి కార్మికులు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం నిరసన చేపట్టారు. కార్యక్రమంలో రైస్ మిల్లు వర్కర్స్ యూనియన్ నాయకులు కె.బాలకృష్ణ, కె.కృష్ణారావు, పి.కూర్మారావు, బి.దుర్యోధన, ఆర్.ఏకాశి, బి.వెంకటేశం, బి.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

## పారిశ్రామికంగా వృద్ధి చెందాలి

ప్రజాశక్తి- పొందూరు

యువత పారిశ్రామికంగా వృద్ధి సాధించినపుడే దేశం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం విలేఖరులతో మాట్లాడుతూ ఏ దేశంలోలేని యువశక్తి భారత్ సొంతమని, యువత ప్రభుత్వంపై ఆధారపడకుండా సొంతంగా ఆర్థికంగా, పారిశ్రామికంగా వృద్ధి చెంది పలువురికి ఉద్యోగ, ఉపాధి కల్పించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి కూన ప్రమీల, టిడిపి మండల అధ్యక్షుడు చిగులిపల్లి రామ్మోహన్, ఎంపిటిసి బాడాన హారిక, టిడిపి మండల ఉపాధ్యక్షుడు బాడన శేషగిరి నాయుడు, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు కూన వెంకట సత్యనారాయణ, టిడిపి నాయకులు సీపాన శ్రీరంగనాయకులు, బి.శంకరభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

## సేవలే గుర్తింపునిస్తాయి

### యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కిషోర్ కుమార్

ప్రజాశక్తి- పలాస

ఉద్యోగులకు విధి నిర్వహణలో చేసిన సేవలే గుర్తింపు నిస్తాయని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సంపతిరావు కిషోర్ కుమార్ అన్నారు. కాశీబుగ్గ పరిధిలోని సూదికొండ యుపి స్కూల్‌లో ప్రధానోపాధ్యాయులుగా జి.మధుసూదనరావు పనిచేస్తూ ఇటీవల ఉద్యోగ విరమణ చేపట్టారు. ఇందులో భాగంగా కాశీబుగ్గ ఉన్నత పాఠశాల ఆవరణలో మధుసూదనరావు దంపతులకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మధుసూదనరావు ఉపాధ్యాయ వృత్తిలో ఎంతో మంది విద్యార్థుల ఉన్నతికి కృషి చేశారని అన్నారు. ఒకవైపు ఉపాధ్యాయులుగా పనిచేస్తూ... మరోవైపు ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేశారని కొనియాడారు. యుటిఎఫ్‌లో ఎన్నో పదవులు చేపట్టడం, చేపట్టిన పదవికి న్యాయం చేశారని గుర్తు చేశారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు అందుకున్నారని, అటువంటి వ్యక్తి యుటిఎఫ్‌లో ఉండడం ఆనందంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు గొంటి గిరిధర్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లండ బాబూరావు, బమ్మిడి శ్రీరామ్మూర్తి, జిల్లా సహాధ్యక్షులు కె.దాలయ్య, జిల్లా కార్యదర్శులు కె.రమేష్, జి.రమేష్, ఎంఇఒ చెరుకుపల్లి సత్యం పాల్గొన్నారు.

సన్మానిస్తున్న కిషోర్‌కుమార్

## పలువురు ఆర్థికసాయం

ఇచ్ఛాపురం : ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలోని బుడ్డెపుపేటలో నివాసం ఉంటున్న బుడ్డెపు మోహనరావు మెదడు సంబంధిత సమస్యలతో విశాఖపట్నంలోని ఒక ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పేద కుటుంబానికి చెందిన ఆయన వైద్య ఖర్చులకు రూ.12 లక్షల వరకు అవసరం ఉంది. ఆ విషయం తెలుసుకున్న ఇచ్ఛాపురం సోషల్ రెస్పాన్సిబులిటీ ఆర్గనైజేషన్ మోహనరావు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.పది వేలు ఆర్థికసాయం ఆయన కుమార్తె అరుణకు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో సోషల్ రెస్పాన్సిబులిటీ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు ధనుష్ రంగ, సభ్యుడు గుడియా రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**కొత్తూరు :** మండలంలోని సిరుసువాడకు చెందిన కర్రి రామారావు ఆటో డ్రైవర్‌గా, భార్య శ్రీదేవి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి కీర్తన, కిరణ్, సంకీర్తన ముగ్గురు పిల్లలు. ఇటీవల సంకీర్తన జ్వరం బారిన పడడంతో శ్రీకాకుళంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్య పరీక్షలు అనంతరం లివర్ పూర్తిగా పాడైనట్లు డాక్టర్లు తెలిపారు. మెరుగైన వైద్యం కోసం విశాఖ కెజిహెచ్‌కు, అక్కడి నుంచి విజయవాడ మణిపాల్ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. లివర్ మార్పిడికి సుమారు రూ.50 లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారు. ఆర్థికస్తోమత లేకపోవడంతో భగత్ సింగ్ ఛారిటబుల్ ట్రస్టును సంప్రదించారు. స్పందించిన ట్రస్టు సభ్యులు రూ.50 వేలు చెక్కును కుమార్తె తండ్రి రామారావుకు ఆదివారం అందజేశారు. ట్రస్టు సభ్యులు తంగుడు ఉపేంద్ర, ఎస్.హరి, కె.పోలినాయుడు, కె.నూకరాజు, ఎ.భగవాన్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఢిల్లేశ్వరరావు

## ప్రతి ఎకరాకూ సాగునీరు

**ఆమదాలవలస:** నారాయణపురం ప్రాజెక్టు పరిధిలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తానని నారాయణపురం ప్రాజెక్ట్ చైర్మన్ సనపల ఢిల్లేశ్వరరావు అన్నారు. నారాయణపురం ప్రాజెక్ట్ చైర్మన్‌గా ఎన్నికైన ఆయనను ఆదివారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు నూక రాజు ఆధ్వర్యంలో టిడిపి నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఢిల్లేశ్వరరావు మాట్లాడుతూ నారాయణపురం ప్రాజెక్ట్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎంపిక చేసినందుకు సిఎం చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వైసిపి పాలనలో సాగునీటి కాలువలు ఎటువంటి అభివృద్ధికి నోచుకోకపోవడంతో ప్రాజెక్టు పరిధిలో ఉన్న 39 వేల ఎకరాల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు నూకరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటైన కూటమి ప్రభుత్వం ఆరు నెలల పాలనలోనే సాగు నీటి సంఘాలను ఏర్పాటు చేసి రైతులకు అవసరమైన అన్ని సాగునీటి ప్రాజెక్టులను అభివృద్ధి చేయటానికి చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి బిసిసెల్ కార్యదర్శి బోర గోవిందరావు, టిడిపి పట్టణ అధ్యక్షులు సంపదరావు మురళి, పట్టణ బిసిసెల్ అధ్యక్షుడు తంగి గురయ్య, నియోజకవర్గ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు బొడ్డేపల్లి గౌరీపతిరావు తదితరులు పాల్గొన్నారు.

# నిత్యం ట్రాఫిక్ నరకం

- రహదారిపై సరుకుల అన్‌లోడింగ్
- చోద్యం చూస్తున్న పోలీసులు

ప్రధాన రోడ్డుపై సరుకును అన్‌లోడ్ చేయడంతో ఇరుక్కుపోయిన బస్సు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలో ట్రాఫిక్ పెరిగిపోవడంతో ప్రయాణికులు, ప్రజలు నిత్యం నరకం చూస్తున్నారు. రహదారిపైనే తోపుడు బండ్లు ఎక్కడపడితే అక్కడ పెట్టి వ్యాపారం కొనసాగిస్తుండడంతో ప్రధాన రహదారిపై ప్రయాణించాలంటే పలువురు గంటల తరబడి ఆగి వెళ్లాల్సిందేనని వాహనదారులు, ప్రజలు వాపోతున్నారు. పట్టణానికి చెందిన ఓ వ్యాపారి నిత్యం తనకు వచ్చే సరుకులను అన్ లోడింగ్ చేయడానికి ప్రధాన రహదారినే ఎంచుకోవడం విశేషం. గతంలో పట్టణానికి వచ్చే సరుకులను పట్టణ శివారులో ఉన్న పారిశ్రామిక వాడ వద్ద నుంచి చిన్న చిన్న వాహనాలతో వ్యాపారులు గోదాములకు చేరవేసేవారు. ఇటీవల కొంత కాలంగా ఆ విధానానికి వ్యాపారులు స్వస్తిపలికి తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండడంతో ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణంలో రహదారిపై సరుకులను దిగుమతి చేయడంతో వెనుక వచ్చే ఆర్‌టిసి బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనదారులు గంటల తరబడి ప్రధాన రహదారిపై నిలిచిపోతున్నాయి. అధికారులకు సెలవు దినాలైన రోజుల్లో వేకువజామున పెద్ద మొత్తంలో లారీలతో సరుకులను తీసుకువచ్చి ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్ను చెల్లించకుండా దిగుమతి చేసుకుంటున్నాడని తోటి వ్యాపారులు చెబుతున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే దిగుమతి అయ్యేంతవరకు ఆగాల్సిందేనని దురుసుగా ప్రవర్తిస్తున్నాడని ప్రయాణికులు, ప్రజలు చెబుతున్నారు. సుదూర ప్రాంతాల నుంచి రోజుల తరబడి రైళ్లలో ప్రయాణం చేసి స్వస్థలానికి చేరుకోవడానికి ఆమదాలవలస పట్టణంలో గంటల తరబడి ప్రధాన రహదారిపై రద్దీలో ఇరుక్కుని నానా అగచాట్లు పడుతున్నామని పలువురు రైల్వే ప్రయాణికులు వాపోతున్నారు. పట్టణ రహదారులపై ప్రయాణించాలంటే భయపడుతున్నామని పలువురు పేర్కొంటున్నారు. ఆర్‌టిసి బస్సుల డ్రైవర్లు సైతం వ్యాపారి ఎలా చెబితే అలాగే వెళ్లాల్సిన పరిస్థితి దాపురించిందని వాపోతున్నారు. ఎవరైనా ఫోటోలు తీసి సామాజిక మాధ్యమాలలో పెట్టాలని ప్రయత్నిస్తే ఏమవుతుంది అంటూ ఎదురు ప్రశ్నించడమే కాకుండా నాకు పోలీసులు, రాజకీయ నాయకులు తెలుసంటూ ఏమి చేయలేరని తిరిగి ఎదురుదాడి చేస్తాడని పలువురు వాపోతున్నారు. రహదారిపై రద్దీ లేని సమయంలో రాత్రి సమయాల్లో చేయాల్సిన పనులు అటు వాహనదారులకు ఇటు ప్రయాణికులకు ఇబ్బంది పెట్టి రోడ్డుపై లారీలు నిలబెడుతుంటే పోలీసులు చోద్యం చూస్తూ ఉంటారని పలువురు విమర్శిస్తున్నారు. ప్రధాన రహదారిపై రద్దీని క్రమబద్ధీకరించాల్సిన పోలీసులు చూసి చూడనట్టు వ్యవహరించడమే ఇందుకు కారణమని పట్టణ ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా పోలీసు అధికారులు జోక్యం చేసుకొని రద్దీని క్రమబద్ధీకరించి ప్రజలు, ప్రయాణికులను ట్రాఫిక్ కష్టాల నుంచి గట్టెక్కించాలని పలువురు ముక్తకంఠంతో కోరుతున్నారు.

## గిట్టుబాటు ధర కల్పించాలి

**ఎచ్చెర్ల:** సరుగుడు, నీలగిరి రైతులకు పేపర్ పరిశ్రమలు అన్యాయం చేస్తున్నాయని జిల్లా నీలగిరి, సరుగుడు రైతు సంఘం అధ్యక్షుడు గురుమూర్తి, సెక్రటరీ బుగత రాంబాబు ఆరోపించారు. ఆదివారం మండలంలోని కేశవరావుపేటలో వారు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. గతంలో పేపర్ పరిశ్రమలు నీలగిరి, సరుగుడు పంటలను అధిక రేట్లుతో కొనుగోలు చేసి ఇప్పుడు ఒకేసారి ధరను తగ్గించేశారని ఆవేదన చెందారు. సరిగా లేని కలపను ఒకప్పుడు కొనుగోలు చేసేవారని ఇప్పుడు కలపలో వ్యత్యాసం చూస్తున్నారన్నారు. ఇటీవల కర్ర రూ.9500 చొప్పున కొనుగోలు చేసే వారిని ప్రస్తుతం ఆ కొలతల కర్ర కొనుగోలు చేయకపోగా, మిల్లర్ల చుట్టూ తిరిగితే 5 వేల నుంచి రూ.6 వేల మధ్యలో కొనుగోలు చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా సరుగుడు, నీలగిరి పంటల రైతులకు పేపర్ పరిశ్రమలు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. లేనియెడల ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సన్యాసిరెడ్డి, పైడిపెద్ది పూర్ణ చంద్రరావు, గాలిరెడ్డి అప్పల గురువులు, పైడి పూర్ణ, నాగేశ్వరరావు ఉన్నారు.

మాట్లాడుతున్న గురుమూర్తి తదితరులు

# గణిత విద్యతోనే సమాజాభివృద్ధి

విగ్రహానికి పూలమాలలు వేస్తున్న రమేష్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

గణిత విద్యతోనే సమాజాభివృద్ధి, దేశవృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని అంబేద్కర్ ఆడిటోరియం ఆధ్వర్యంలో సిక్కోలు గణిత ఉపాధ్యాయ వేదిక వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ పరీక్షల్లో రాణించాలంటే గణితంపై విద్యార్థులు పట్టు సాధించాలన్నారు. గణిత విద్యపై అధ్యాపకులు పూర్తిస్థాయిలో నైపుణ్యాలను సాధించి విద్యార్థుల సామర్థ్యాన్ని పెంచే విధంగా విద్యా బోధన చేయాలన్నారు. జిల్లాలో విద్యతో పాటు ఉపాధి అవకాశాలు పెరిగేలా ఐటి హబ్‌లను నెలకొల్పు తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన గణిత ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**ఎచ్చెర్ల:** మండలంలోని కేశవరావుపేట పాఠశాలలో గణిత దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులు పొందూరు శ్యామలరావు, పూజారి రామారావు విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

**లావేరు:** లావేరు శాఖా గ్రంథాలయంలో శ్రీనివాస్ రామానుజన్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు గ్రంథాలయం తరపున బహుమతులు అందజేశారు. కార్యక్రమములో గ్రంథాలయ సహాయకుడు టి.వీరభద్రుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

**పొందూరు:** లోలుగు కెజిబివి పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవం కార్యక్రమాన్ని ప్రభావతి జాగృతి

లావేరు : నివాళ్లర్పిస్తున్న గ్రంథాలయాధికారి, విద్యార్థులు



శ్రీకాకుళం అర్బన్ : చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న ఎమ్మెల్యే శంకర్

సంస్థ వ్యవస్థాపకులు సప్పటి వసంతరావు, పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.సౌమ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. శ్రీనివాసరామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు మెడల్స్, సర్టిఫికేట్లు అందించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**కవిటి:** అపారమైన మేధస్సుతో భారతదేశపు కీర్తిని ప్రపంచ గణిత శిఖరాలపై ఎగురవేసిన మహాగణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ అని జెడ్‌పిటిసి మాజీ సభ్యుడు బెందాలం రమేష్ అన్నారు. కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో శ్రీనివాస రామానుజన్ విగ్రహానికి ఆదివారం పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం బి.మల్లేశ్వరరావు, ఉషోదయ యువజన సంఘం అధ్యక్షుడు పాండవ చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ ఆరింగి మధు, ఎస్ఎంసి చైర్మన్ తెప్పల మోహనరావు, ఆరింగి త్రివిక్రమరావు, వజ్జ రంగారావు, బెందాళం సురేష్, ప్రగడ మణిబాబు, గొరకల రామారావు, హరిహరరావు పాల్గొన్నారు.